# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## **ప్రాంతీయ వార్తలు**

**తేది : 15-02-2026** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా రాష్ట్రంలోని దేవాలయాలను అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుంటున్నారు.**

2. **రాష్ట్ర బడ్జెట్‌లో వైద్య ఆరోగ్య శాఖకు 19 వేల 306 కోట్ల రూపాయలను కేటాయించారని ఆ శాఖ మంత్రి వై.సత్యకుమార్ యాదవ్ తెలిపారు.**

3. **ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందరికి చేరువయ్యేలా బడ్జెట్ ఉందని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు.**

4. **టి 20 ప్రపంచకప్ క్రికెట్ టోర్నీలో భారత్, పాకిస్తాన్‌ల మధ్య ఈరోజు మ్యాచ్ జరగనుంది.**

==========================

మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా రాష్ట్రంలోని దేవాలయాలను అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుంటున్నారు. మహా శివరాత్రికి ప్రసిద్ధి గాంచిన పల్నాడు జిల్లా కొటప్పకొండలో త్రికోటేశ్వరస్వామికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా హోంమంత్రి వంగలపూడి అనిత, విద్యుత్తు శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం హోంమంత్రి మాట్లాడుతూ..

..వాయిస్.. 25 సెకన్లు

మరో వైపు శ్రీకాకుళం, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ, ఏలూరు, తిరుపతి, నంద్యాల, కృష్ణా, ఎన్టీఆర్, అనంతపురం జిల్లాలలో ఉన్న ప్రముఖ ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు.

-------------------------

మహా శివరాత్రి సందర్భంగా రాష్ట్రంలోని శైవక్షేత్రాలలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేపట్టినట్లు రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. మహాశివరాత్రి సందర్భంగా శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా సంగంలోని శ్రీ కామాక్షి సమేత సంగమేశ్వర స్వామి వారిని ఆయన ఈరోజు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. శ్రీశైలం, కోటప్పకొండ, శ్రీకాళహస్తి, ద్రాక్షారామం వంటి ప్రముఖ శైవ క్షేత్రాలతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా దేవాలయాలు

భక్తజనంతో ఆధ్యాత్మిక శోభతో నిండిపోయాయని పేర్కొన్నారు. సామాన్య భక్తులకు దర్శనం సమయంలో ముందుగా అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు.

---------------------------

రాష్ట్ర బడ్జెట్‌లో వైద్య ఆరోగ్య శాఖకు 19 వేల 306 కోట్ల రూపాయలను కేటాయించారని ఆ శాఖ మంత్రి వై.సత్యకుమార్ యాదవ్ తెలిపారు. శాసనసభ మీడియా పాయింట్ వద్ద ఆయన నిన్న మాట్లాడుతూ.. శాఖల వారీగా నిధుల కేటాయింపుల్లో వైద్య ఆరోగ్య శాఖకు 4వ స్థానం లభించినట్లు పేర్కొన్నారు. విద్య, బిసి సంక్షేమం, పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ తరువాత వైద్య ఆరోగ్య శాఖకు అధిక నిధులు కేటాయించినట్లు వెల్లడించారు. మొత్తం బడ్జెట్లో వైద్య ఆరోగ్య శాఖకు 5.81 శాతం నిధులు లభించినట్లు మంత్రి పేర్కొంటూ..

వాయిస్.. 30 సెకన్లు

---------------------------

ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందరికి చేరువయ్యేలా బడ్జెట్ ఉందని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రం అభివృద్ధి పథంలో సాగుతూ పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ రంగాల్లో మరింత ఉత్తేజం రావాలని మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఆయన కాంక్షించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రముఖ ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. భక్తుల భద్రతే ప్రభుత్వ బాధ్యత అని అన్నారు.

---------------------------

నెల్లూరు నగరంలోని లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురి కాకుండా ఉండేందుకు 50 కోట్ల రూపాయలతో కాలువల ఆధునికీకరణ చేపడుతున్నట్లు రాష్ట్ర పురపాలక.. పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. నెల్లూరు సిటీ నియోజకవర్గ పరిధిలోని ఉయ్యాల కాలువను ఆయన అధికారులతో కలిసి నిన్న పరిశీలించారు. భవిష్యత్తులో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని మంత్రి నారాయణ పేర్కొంటూ..

వాయిస్.. 30 సెకన్లు

---------------------------

ప్రపంచ యుద్ధ నౌకల ప్రదర్శనకు విశాఖపట్నం వేదిక కానుంది. ఈ నెల 18వ తేదీన అంతర్జాతీయ యుద్ధనౌకల సమీక్ష (ఫ్లీట్ రివ్యూ-2026),19వ తేదీన మిలన్, ఇంటర్నేషనల్ సిటీ పరేడ్, 20వ తేదీన 'ఐయాన్స్ కాన్‌క్లేవ్ ఆఫ్ చీఫ్స్' కార్యక్రమాలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో నిన్న పలు దేశాల నుంచి నౌకలు విశాఖపట్నానికి చేరుకున్నాయి. ఈ నెల 17వ తేదీన రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము విశాఖపట్నం చేరుకుని 18వ తేదీన జరిగే యుద్ధనౌకల సమీక్షలో పాల్గొంటారు. పదేళ్ల తర్వాత మళ్లీ విశాఖపట్నం వేదికగా జరుగుతున్న ఫ్లీట్ రివ్యూలో 70దేశాలు పాల్గొననున్నాయి.

---------------------------

గేట్స్ ఫౌండేషన్ వ్యవస్థాపక ఛైర్మన్ బిల్‌గేట్స్ రేపు రాష్ట్రంలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి కే.పవన్‌కల్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌లతో ఆయన సమావేశం అవుతారు. 'సంజీవని' డిజిటల్ హెల్త్ కేర్ ప్రాజెక్టు, ఏఐ ఆధారిత వ్యవసాయం, ఇతర రంగాల్లో ప్రభుత్వం చేపట్టిన ప్రాజెక్టులపై చర్చిస్తారు. అనంతరం రాష్ట్ర సచివాలయంలో ఆర్టీజీఎస్‌కు వెళ్లి పరిపాలనలో సాంకేతిక వినియోగాన్ని పరిశీలిస్తారు. ఆ తరువాత ముఖ్యమంత్రితో కలిసి బిల్‌గేట్స్ ఉండవల్లి పరిధిలో సాంకేతికత ఉపయోగించి సత్ఫలితాలు సాధిస్తున్న రైతులతో సమావేశం అవుతారు.

---------------------------

రాష్ట్రంలో ఉన్న స్మశాన వాటికల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు మండలం ఆగర్తిపాలెంలో కోటి 25 లక్షల రూపాయలతో ఆరు స్మశాన వాటికల అభివృద్ధి పనులను మంత్రి ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ..

వాయిస్..27 సెకన్లు

---------------------------

ఐసీసీ టీ20 ప్రపంచకప్ లో ఈరోజు భారత్, పాకిస్తాన్ జట్లు తలపడనున్నాయి. శ్రీలంక దేశంలోని కొలంబోలో ఉన్న ఆర్.ప్రేమదాస స్టేడియం వేదికగా రాత్రి ఏడు గంటలకు మ్యాచ్ ప్రారంభం కానుంది. ఇప్పటికే ఇరు జట్లు చెరో రెండు మ్యాచ్‌లు గెలుపొందాయి. మరో వైపు ఈ మ్యాచ్‌కు వర్షం అంతరాయం ఉన్నట్లు వాతావరణ శాఖ అంచనా వేసింది. మ్యాచ్ రద్దయితే ఇరు జట్లకు చెరో పాయింట్ ఇస్తారు. ఇప్పటి వరకు భారత్, పాకిస్థాన్ టీ20 ప్రపంచకప్‌లో 8 సార్లు పోటీ పడగా 7 సార్లు భారత్ విజయం సాధించింది. ఒక్కసారి పాకిస్థాన్ గెలుపొందింది.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 131వ సంచిక ఈనెల 22వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. "మన్ కీ బాత్" కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు 20వ తేదీ వరకు పంపవచ్చు.

=====================